RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం
తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 341 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 16-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 341 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 16-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..

ఇదే మా విధానం

విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ

మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు

రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక

ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ

విజయవాడ, సిటిజన్ టైమ్స్

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య

తరువాయి 2లో..

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే నీటి సంక్షోభం

సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్

తెలంగాణ, సిటిజన్ టైమ్స్

తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రం కఠినమైన నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు అంచనా వేసినట్లుగానే పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుందని, ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్ నినో

తరువాయి 2లో..

విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ

494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత

విజయవాడ, సిటిజన్ టైమ్స్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ

తరువాయి 2లో..

'మనం చేసి చూపిద్దాం'...

ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ

క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి

భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన

క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం

మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు

తరువాయి 2లో..

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

స్ఫూర్తి శిఖరమన్న చంద్రబాబు, ఆదర్శమన్న పవన్ కల్యాణ్

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులు

దేశ అణు, సాంకేతిక రంగాలకు కలాం దిశానిర్దేశం చేశారన్న చంద్రబాబు

కలాం ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పిలుపు

అమరావతి, సిటిజన్ టైమ్స్

భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ

కార్పొరేషన్ ఎన్నికలు.. కూటమిలో ఏ పార్టీ ఎక్కడి నుంచి?

తరువాయి 2లో..

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..

కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి

ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి

చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్

పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. "అమెరికాతో

తరువాయి 2లో..

పుర పోరుకు 5,485 కేంద్రాల్లో నామినేషన్లు

నేటి నుంచి 3 రోజులపాటు స్వీకరణ

28 జిల్లాలకు పరిశీలకుల నియామకం

స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పరిశీలకులకు ఎస్ఈసీ ఆదేశం



అమరావతి

రాష్ట్రంలో 100 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో శుక్రవారం

తరువాయి 2లో..

ఎడిటోరియల్

వైసీపీకి ఇష్టం లేని మాట ఏకగ్రీవం !

అవును. ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ఏకగ్రీవం అసలే వద్దు అంటోంది. ఆ మాట ఎక్కడ ఏ కోశానా ఏ మారు మూల పంచాయతీ వార్డు మెంబర్ ఎన్నికల్లో సైతం వినిపించకూడదు అని గట్టి పట్టుదలతో ఉంది. ఏం చేస్తారో తెలియదు, ఎలాంటి వ్యూహాలు పన్నుతారో కూడా తెలియదు, వైసీపీ అభ్యర్థులు అన్ని చోట్లా పోటీ చేసి తీరాల్సిందే అంటూ వైసీపీ అధినాయకత్వం పార్టీ నేతలకు పూర్తి స్థాయిలో ఆదేశాలు జారీ చేసింది. డూ ఆర్ డై అన్న తీరున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాడాలని సూచించింది. బుధవారం స్థానిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో వైసీపీ పూర్తి స్థాయిలో అప్రమత్తం అయింది అని అంటున్నారు. దాంతో ఏకగ్రీవాలు లేకుండా ప్రతీ చోటా వైసీపీ జెండా ఎగిరి తీరాల్సిందే అని స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించింది అని అంటున్నారు. పార్టీ నాయకులకు అభ్యర్థులకు ఈ విషయంలో వైసీపీ హైకమాండ్ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని కూడా భరోసా ఇచ్చింది. మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకూ పార్టీ నేతలు అంతా అలెర్ట్ గా ఉండాలని వైసీపీ అధినాయకత్వం సూచించింది. నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్ వరకూ అలాగే కౌంటింగ్ దాకా పార్టీ నాయకులు అంతా వేయి కళ్లతో పరిశీలించాలని సూచించింది. పార్టీ నాయకులు కూడా అభ్యర్థులకు మద్దతుగా ఉంటూ పార్టీ విజయావకాశాలను పూర్తి స్థాయిలో పెంచాలని కోరింది. అలాగే అభ్యర్థులకు దిశా నిర్దేశం చేస్తూ వారిలో ఆత్మ స్థైర్యం నిండుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైసీపీ అధినేత జగన్ కోరారు. ఎన్నికల షెడ్యూల్ ని చూసిన వైసీపీ హైకమాండ్ సమయం తక్కువగా ఉందని అభిప్రాయపడుతోంది. దీని వల్ల వ్యూహాత్మకంగా అంతా వ్యవహరించాలని జగన్ కోరారు. అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి, డాక్యుమెంటేషన్, నామినేషన్లు, ప్రచార సన్నాహాలు అన్నీ కూడా పూర్తి కో ఆర్డినేషన్ తో ఏకకాలంలో జరగాలని ఆయన అన్నారు. రాబోయే 15 నుంచి 20 రోజుల పాటు పరిశీలకులు నిరంతరం అభ్యర్థులకు అందుబాటులో ఉండి సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే అభ్యర్థులను న్యాయ, మీడియా, డిజిటల్, సంస్థాగత బృందాలతో అనుసంధానించాలని అన్నారు. అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాలు, బకాయిలు లేని ధృవీకరణ పత్రాలు ఇతర తప్పనిసరి పత్రాల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఒకవేళ ఏవైనా జాప్యాలు జరిగితే అవసరమైన చోట న్యాయపరమైన జోక్యం కోసం కేంద్ర కార్యాలయానికి నివేదించాలని జగన్ సూచించారు. ఇక సమయం చాలా తక్కువగా ఉంది కాబట్టి చివరి నిముషం వరకూ ఆగకుండా వైసీపీ అభ్యర్థులు త్వరగా నామినేషన్లు దాఖలు చేయాలని జగన్ కోరారు. ఇక ఏవైనా ఆటంకాలు, పోలీసుల జోక్యం లేదా పరిపాలనాపరమైన అవకతవకలను వీడియో సాక్ష్యాల ద్వారా నమోదు చేయాలని సూచించారు. వైసీపీకి చెందిన ఎన్నికల పరిశీలకులు ప్రచార కార్యకలాపాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సీసీటీవీ కవరేజ్, కౌంటింగ్ కేంద్రాలు ఇతర ఎన్నికల సంబంధిత ఏర్పాట్లను కూడా పర్యవేక్షించాలని అన్నారు. క్షేత్రస్థాయి బృందాలను పార్లమెంట్ పరిశీలకులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు కేంద్ర కార్యాలయంతో అనుసంధానించే రోజువారీ నివేదన యంత్రాంగం పార్టీకి ఉంటుందని చెప్పారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అంతటా పరిశీలకుల క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారం, సమన్వయంతో పాటు అభ్యర్థులకు అందించే మద్దతు ఆధారంగా వారిని అంచనా వేస్తామని జగన్ చెప్పుకొచ్చారు. వైసీపీ విషయానికి వస్తే ఆనాడు అంటే 2021లో ఏకగ్రీవాలు చేయాల్సిందే అన్న వైఖరిని ప్రదర్శించింది అని గుర్తు చేస్తున్నారు. ఇపుడు మాత్రం అసలు ఏకగ్రీవం అన్న పదం వినిపించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. పోటీకి దిగాల్సిందే సత్తా చూపించాల్సిందే అని అంటోంది. మరి వైసీపీ అధినాయకత్వం వేడి ఒత్తిడి దిగువ స్థాయి క్యాడర్ ఏ మేరకు ఒంటబట్టించుకుంటుంది. గ్రౌండ్ లో ఏ మేరకు ఫైట్ ఇస్తుంది అన్నది రానున్న రోజులలో తెలియనుంది.

సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..

ఇదే మా విధానం

సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా–2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే నీటి సంక్షోభం

సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

పరిస్థితులపై మంత్రులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి కేవలం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న ఈ స్వల్ప జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. వచ్చే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతాంగం పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యాసంగి సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి, తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రైతులు ఈ త్యాగానికి సిద్ధపడాలని, ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని విన్నవించారు. మరోవైపు, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సగటు డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల భారం పడుతోందని, అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ వాడకం జరగడం గతంలో ఎన్నడూ లేదని వివరించారు. మార్కెట్‌లో ఎంత వ్యయానికైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'మనం చేసి చూపిద్దాం'...

ఘన నివాళులు అర్పించారు.

చారిత్రక విజయాలపై ప్రశంసలు

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడారంగానికి ప్రభుత్వ అండ

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

మొదటి పేజీ తరువాయి

విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

కార్పొరేషన్ ఎన్నికలు.. కూటమిలో ఏ పార్టీ ఎక్కడి నుంచి?

అమరావతి, సిటిజన్ టైమ్స్

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై కూటమి పార్టీలైన తెదేపా, జనసేన, భాజపా నిర్ణయానికి వచ్చాయి. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ లింగమనేని రమేష్ తదితరులు భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఏ పార్టీ ఎక్కడి నుంచి పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు జాబితాను విడుదల చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లలో తెదేపా 11 స్థానాల్లో, జనసేన 4, భాజపా 2 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. జనసేనకు శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ కార్పొరేషన్లు కేటాయించారు. భాజపాకు రాజమండ్రి, అనంతపురం కార్పొరేషన్లు కేటాయించారు. తెదేపాకు విజయనగరం, గ్రేటర్ విశాఖ, మచిలీపట్నం, మంగళగిరి–తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లు కేటాయించారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో తెదేపాకు 78 స్థానాల్లో, జనసేన 21 స్థానాల్లో, భాజపా 7 స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

స్ఫూర్తి శిఖరమన్న చంద్రబాబు, ఆదర్శమన్న పవన్ కల్యాణ

సందర్భంగా దేశాభివృద్ధికి, సమాజానికి కలాం అందించిన అసమాన సేవలను వారు స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలాంను "స్ఫూర్తి శిఖరం"గా అభివర్ణించారు. ఆయన ఒక అరుదైన వ్యక్తిత్వమని, భారత అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త దిశానిర్దేశం చేసిన దార్శనికుడని కొనియాడారు. కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆయన పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో.. రామేశ్వరంలోని ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, దేశం గర్వించే శాస్త్రవేత్తగా, "ప్రజా రాష్ట్రపతి"గా కలాం ఎదిగిన తీరును కొనియాడారు. ఎస్ఎల్వీ–3, అగ్ని, పృథ్వీ క్షిపణుల రూపకల్పన, పోఖ్రాన్–2 అణు పరీక్షలు, టెక్నాలజీ విజన్ 2020 వంటి కీలక ఘట్టాలలో ఆయన పోషించిన అద్వితీయ పాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. సామాన్య నేపథ్యం ఉన్నత లక్ష్యాల సాధనకు అడ్డంకి కాదని కలాం జీవితం నిరూపిస్తుందన్నారు. శాస్త్రీయ దృక్పథం, స్వయం సమృద్ధి, నిరంతర అభ్యాసం వంటి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

పుర పోరుకు 5,485 కేంద్రాల్లో నామినేషన్లు

ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అనుమతిస్తారు. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు, 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు కలిపి మొత్తం 5,485 కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, కమిషనర్ సంపత్‌కుమార్‌లు గురువారం పుర కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏర్పాట్ల విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జోరు పెంచింది. ఎన్నికలు జరుగుతున్న 28 జిల్లాలకు ఐఏఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా పరిశీలకులతో గురువారం సమావేశమయ్యారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్ఈసీ ఆదేశించారు. గుర్తుల కేటాయింపుపై నోటిఫికేషన్: రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపుపొందిన పార్టీలతో పాటు రిజిస్టరైన పార్టీలకు స్థానిక ఎన్నికల్లో గుర్తుల కేటాయింపుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. మేయర్, వార్డు సభ్యులకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు గతంలో జారీ చేసిన గుర్తులే అమలులో ఉంటాయని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. బ్యాలట్ పత్రంలో నోటా గుర్తు చేర్చారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఐఏఎస్ అధికారుల వివరాలు

ఎన్నికల వేళ మద్యం అక్రమాలపై నిఘా

కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:
జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, నిల్వలపై తనిఖీలు ముమ్మరం చేయాలని, అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు 48 గంటల నిషేధిత కాలంలో, ఓట్ల లెక్కింపు రోజున మద్యం విక్రయాలు, పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

జీవీఎంసీ ఎన్నికలకు భారీ భద్రత.. 8 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు!

120 వార్డులు.. 1,990 పోలింగ్ కేంద్రాలు.. 18.37 లక్షల మంది ఓటర్లు

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ । అక్టోబర్ 15:
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) రెండో సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి తదితర అధికారులతో కలిసి జీవీఎంసీ ఎన్నికల సన్నద్ధత, భద్రత, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

120 వార్డుల్లో 1,990 పోలింగ్ కేంద్రాలు

జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల్లో 778 ప్రాంతాల్లో మొత్తం 1,990 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 18,37,901 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఎన్నికల నిర్వహణలో సుమారు 8,000 మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. వచ్చే ఆదివారం నాటికి ఈ ఏర్పాట్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలను నోడల్, జోనల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేదు

ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి నిబంధనల ప్రకారం శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు విధులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, తొలి శిక్షణ సమయంలో ఎన్నికల సిబ్బంది నుంచి ఫారం–22లను స్వీకరించి తదుపరి ప్రక్రియను పక్కాగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల

సామగ్రి పంపిణీ, రవాణా, భద్రపరిచే సమయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాల వర్గీకరణ, తరలింపు వంటి కీలక ప్రక్రియలను వీడియో చిత్రీకరించాలని ఆదేశించారు.

సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచుతూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల బందోబస్తు కోసం 6,548 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తామని, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రత కల్పించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల ఖర్చులపై ప్రత్యేక పర్యవేక్షణ

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు తావివ్వరాదని, నిబంధనలకు విరుద్ధంగా కొత్త పనులకు మంజూరులు ఇవ్వడం, టెండర్లు పిలవడం వంటి చర్యలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన అనుమతుల జారీ కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ స్థాయిలో సింగిల్ విండో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులు అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించకుండా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులకు సూచించారు.

ఐదు రౌండ్లలో ఓట్ల లెక్కింపు..: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ఐదు రౌండ్లలో పూర్తయ్యేలా అవసరమైన టేబుళ్లు, సిబ్బంది, ఇతర సౌకర్యాలను సమకూరుస్తున్నట్లు వివరించారు. స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలను తరలించే సమయంలో భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. మేయర్ అభ్యర్థికి రూ.40 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.15 లక్షల ఎన్నికల వ్యయ పరిమితి ఉన్నందున అభ్యర్థుల ఖర్చులను నిబంధనల మేరకు నమోదు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 201 రూట్లు, 239 రూట్ అధికారులు, 67 సెక్టోరల్ అధికారులు, 11 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 20 సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వివరించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కోసం మరో 21 బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమేష్, రమణమూర్తి, వర్మ, నల్లనయ్య, సత్యవేణి, మేయర్ ఎన్నికల ఆర్వో దయానిధి, సీసీపీ ప్రభాకర్‌తో పాటు పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా ప్రియాంక దండి దరఖాస్తు

విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తా: ప్రియాంక

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15
జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ విశాఖ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రియాంక దండి పార్టీ నాయకత్వానికి దరఖాస్తు సమర్పించారు. మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేస్తే ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖపట్నంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తానని ఆమె తెలిపారు. విశాఖ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, మేనిఫెస్టో ద్వారా ప్రజల ముందుంచుతానని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో జీవీఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఈగల మోహన్ సాయి, పర్వీన్ ఖాన్, చింతపల్లి వెంకటేష్, గుర్రం కనకరావు, ఓలిశెట్టి స్వప్న, ఎం. అరుణ కుమారి, ఇసంపల్లి రఘురాజా పార్టీకి దరఖాస్తులు సమర్పించారు.

తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని కుటుంబానికి అప్పగించిన పోలీసులు

యువకుల చొరవ.. వన్‌టౌన్ పోలీసుల సమయస్ఫూర్తి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:
విశాఖపట్నంలో తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని స్థానిక యువకులు, వన్‌టౌన్ పోలీసులు సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. కనకమహాలక్ష్మి ఆలయం నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో ఒంటరిగా తిరుగుతున్న షేక్ అమాన్ అనే బాలుడిని గుర్తించిన యువకులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు బాలుడి వివరాలను సేకరించి, కోటవీధికి చెందినవాడిగా గుర్తించారు. అనంతరం బాలుడి తాతను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడిని సురక్షితంగా ఇంటికి చేర్చడంలో చొరవ చూపిన యువకులను వన్‌టౌన్ సీఐ వరప్రసాద్ అభినందించారు. బాలుడు క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవీఎంసీ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అనుమతులు లేకుండా ప్రచార ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయొద్దు: కేతన్ గార్గ్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:
జీవీఎంసీ ఎన్నికలు--2026లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లపై ముద్రణ సంస్థ, ముద్రణ చేయించిన వారి వివరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, మున్సిపల్ స్థలాల్లో ప్రచార సామగ్రి ఏర్పాటు చేయరాదని, ప్రైవేటు స్థలాల్లో యజమాని అనుమతితో పాటు సంబంధిత అధికారుల అనుమతి పొందాలని సూచించారు. ప్రచార వాహనాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. సభలు, మైకులు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు 10 తనిఖీ బృందాలు, 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లను నగదు, మద్యం, ఇతర వస్తువులతో ప్రలోభపెట్టినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఉల్లంఘనలపై జీవీఎంసీ కంట్రోల్ రూమ్ నంబర్ 1800 4250 0009 లేదా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమాచారం అందించాలని కమిషనర్ కోరారు.

ఎన్నికల పరిశీలకులుగా గీతాంజలి శర్మ నియామకం

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:
స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎలక్షన్ అబ్జర్వర్స్ నియామకం జరిగింది. 28 మంది ఐఏఎస్ అధికారులను ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. విశాఖ జిల్లా ఎన్నికల పరిశీలకులుగా ఏపీ ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జీవీఎంసీ మేయర్ పీఠం స్థానికులకే ఇవ్వాలి

స్థానికేతరులకు అవకాశం ఇస్తే ప్రజలతో కలిసి ఓడిస్తాం: తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ హెచ్చరిక

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15::
జీవీఎంసీ మేయర్ పదవిని విశాఖకు చెందిన స్థానికులకే కేటాయించాలని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరంలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ ప్రజల ఆకాంక్షలు, నగర అభివృద్ధి, స్థానికుల ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని మేయర్ అభ్యర్థిని ఎంపిక చేయాలని కోరారు. స్థానికేతరులకు అవకాశం కల్పిస్తే ప్రజా సంఘాలు, యువజన సంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యతిరేకిస్తామని, ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం కల్పించేలా పార్టీ అధిష్ఠానం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని బొత్సను కోరారు.

స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై ఎస్పీ హెచ్చరిక

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:
స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి నిఘా ఏర్పాటు చేశామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపడతామని, అధిక మొత్తంలో నగదు తరలించే వారు సరైన ఆధారాలు చూపించాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కాగా, విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ సిరిమానోత్సవం, మున్సిపల్ ఎన్నికలను సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్టోబర్

28న జరగాల్సిన విజయనగరం మున్సిపల్ ఎన్నికలను అక్టోబర్ 29న నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్, డీఆర్వో సీహెచ్. సత్తిబాబు పాల్గొన్నారు.

పాత్రికేయ విలువల పరిరక్షణే లక్ష్యం కావాలి

అమలాపురంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయం ప్రారంభం

రాజకీయాలకు అతీతంగా, కులమతాలకు దూరంగా నిష్పక్షపాతంగా పనిచేయాలని తీర్మానం

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

పాత్రికేయ వృత్తి విలువలను పరిరక్షిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రెస్ క్లబ్ ముందుకు సాగాలని పాత్రికేయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గురువారం అమలాపురంలో జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాత్రికేయ వృత్తిలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల విశ్వాసాన్ని పొందేలా వార్తా సేకరణ, ప్రచురణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిర్ణయించారు. కుల, మత, వర్గ విచక్షణలకు తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని తీర్మానించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వాస్తవికంగా తెలియజేయడంతో పాటు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల బాధ్యతను గుర్తిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పాత్రికేయుల మధ్య పరస్పర సహకారం పెంపొందించుకోవడం, వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడుకోవడం, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ ప్రతినిధి పెంటా నాగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సూరపురెడ్డి శ్రీరామ్, పల్లె జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ బి.ఏ.జె. రెడ్డి బాబు, దీపిక ఉదయం ఎడిటర్ శీలం సుబ్రహ్మణ్యం, ప్రభాస్ స్టాఫ్ రిపోర్టర్ సత్తి సత్యప్రసాద్, నంబూరు టైమ్స్ స్టాఫ్ రిపోర్టర్ దేవు మహేష్, తూర్పు ఉదయం ఎడిటర్ రంబాల వీరబాబు, ఆంధ్ర న్యూస్ ఎడిటర్ నాగు, సాక్ష్యం స్టాఫ్ రిపోర్టర్ డి. వెంకటేశ్వరరావు, బి.ఎల్. సూర్య, ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, లీగల్ అడ్వైజర్ కన్నీడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

క్యూఆర్ కోడ్ విధానం రద్దు చేయాలి.. కమీషన్ పెంచాలి

జాయింట్ కలెక్టర్‌కు కోనసీమ రేషన్ డీలర్ల సంఘం వినతి

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రేషన్ సరుకుల పంపిణీలో అమలవుతున్న క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు కమీషన్ పెంచాలని కోనసీమ జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు అడపా వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అందుతున్న కమీషన్ నిర్వహణ ఖర్చులకు సరిపోవడం లేదని, వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్నామని డీలర్లు తెలిపారు. గోనె సంచులను తిరిగి ఇవ్వాలనే నిబంధనతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వానికి అందజేసిన గోనె సంచులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, కమీషన్ పెంపుతో పాటు పెండింగ్ బకాయిల చెల్లింపు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి ఏడుకొండలు, గుద్దటి సుబ్బారావు, మంగిపూడి కిషోర్, ఎన్. అన్నపూర్ణ, ఎన్. బాల, పి. సత్యనారాయణ, పి. ప్రసాద్, వై. తాతాజీ, ఎన్. బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో టీడీపీలోకి 20 కుటుంబాలు

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన 20 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. పెనుగొండ చిన్న తరుణ్, తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి టీడీపీ పులివెందుల ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ, హజ్ డైరెక్టర్ మహబూబ్ బాషా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ, భూముల పునఃసర్వేపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

మహబూబాబాద్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ, భూముల పునఃసర్వే పనులను జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపడుతున్న ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అర్హులైన ఓటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మదనాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల పునఃసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వేకు ముందుగానే సమాచారం అందించాలని, రైతులు తమ భూముల హద్దులను ముందుగానే నిర్ధారించుకోవాలని సూచించారు. దీనివల్ల సర్వే ప్రక్రియ సులభంగా, పారదర్శకంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే వివిధ పనులను గుర్తించి, వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత క్షేత్ర సహాయకుడిని ఆదేశించారు. మండలంలో సాగునీరు, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భూ సర్వే సహాయ సంచాలకులు చీర శ్రీనివాసులు, స్థానిక తహసీల్దార్ నాగభవాని, రెవెన్యూ పరిశీలకుడు నరేష్ రెడ్డి, సర్వేయర్లు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

కలాం ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పులివెందులలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జాతీయ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్ షేక్ మహబూబ్ పీరా దిశానిర్దేశంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నూర్ ఉల్లా, హౌస్ బిల్డర్ రఫీ, రాష్ట్ర హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెల్ చైర్మన్ షేక్ మహమ్మద్ అక్రమ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ మాబు సుభాన్, కడప జిల్లా చైర్మన్ షేక్ మహమ్మద్ నసీర్ తదితరులు పాల్గొన్నారు. ఇమామ్ హాఫిజ్ సాబ్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ డాక్టర్

కలాం జీవితం, దేశభక్తి, విద్య పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, విజ్ఞానం, సామాజిక సేవ, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దోమడుగులో సీసీ రోడ్ల నిర్మాణం

గుమ్మడిదల మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు 19వ వార్డులో కోటి 30 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే నిర్మాణ పనుల విషయంలో పలు వివాదాలు చోటుచేసుకోవడంతో పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత వర్గాలతో మాట్లాడి వివాదాలకు పరిష్కారం చూపడంతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంలో భాగంగా చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంతో వార్డులో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గనున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో సమస్యలు ఎదురైతే వాటిని సామరస్యంగా పరిష్కరించుకుని పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అబిశెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజిరెడ్డి, నాయకులు కృష్ణా స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం--22 సమర్పించాలి

అక్టోబర్ 21 మధ్యాహ్నం 3 గంటలలోపు గడువు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం--22ను అక్టోబర్ 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది జోనల్ కార్యాలయాలు లేదా వార్డు సచివాలయాల నుంచి ఫారం--22 పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా అందజేయాలని ఆయన సూచించారు.

వైఎస్. ప్రమీల ఎన్నికల ప్రచారం ప్రారంభం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైఎస్. ప్రమీల 27వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో మమేకమై వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా వార్డులోని డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పరిస్థితి, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై స్థానికులతో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని వైఎస్. ప్రమీల పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి

సమస్యాత్మక గ్రామాల్లో 'సద్భావన'

కార్యక్రమాలు: ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సమస్యాత్మక గ్రామాల్లో 'సద్భావన' అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో పోలీసులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. రాజకీయ కక్షలు, గొడవలకు దూరంగా ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు పార్టీ ప్రతినిధులు సహకరించాలి

స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సహకారాన్ని అందించాలి -జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

కాకినాడ, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఈ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో ఆయన జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు మరియు ఇతర ఎన్నికల నిబంధనలను ఆయన వివరంగా వివరించారు. జిల్లాలో స్థానిక ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం జిల్లా అధికార యంత్రాంగానికి అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూలు ప్రకారం జిల్లాలో మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసి మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్లు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ కౌంటింగ్ తేదీలను ఇప్పటికే ఖరారు చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు ఈ నెల 16 నుంచి 18 వరకు స్వీకరించ బడతాయని, అక్టోబర్ 28న పోలింగ్ అలాగే అక్టోబర్ 30న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసి స్థానాలకు ఈ నెల 19న నోటిఫికేషన్ జారీ చేయబడి, నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న కౌంటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించబడతాయని, మొదటి విడత పోలింగ్ నవంబర్ 26న, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2వ తేదీన జరుగనున్నాయని జిల్లా కలెక్టర్ వివరించారు.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలను విధిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ప్రచార ఖర్చులకు సంబంధించి వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు జెడ్పీటీసీలకు వేర్వేరుగా వ్యయ పరిమితులు విధించబడ్డాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా, అధికారులు కేటాయించిన వాహనాలు నిబంధనల ప్రకారమే అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలను నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సహకారాన్ని అందించింది జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్.అప్పారావు(బీఎస్పీ), సీహెచ్. రమేష్ బాబు (భాజపా), కె.వీరబాబు(సీపీఎం), బి.కృష్ణ(ఐఎన్సీ), జి. సాయిబాబా (తెదేపా), ఆర్ వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), ఎ. సత్యనారాయణ (జెఎస్పీ) ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలు, వార్డుల రిజర్వేషన్లపై తుది గెజిట్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్

అమలాపురం. సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

జిల్లాలో గ్రామపంచాయతీలకు సంబంధించి సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణలో భాగంగా గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఖరారు చేసిన తుది రిజర్వేషన్ల గెజిట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ విడుదల చేశారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనల మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి తుది గెజిట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. సంబంధిత గ్రామపంచాయతీలు, వార్డులకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలను అధికారిక గెజిట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

హైదరాబాద్ హైటెక్ సిటీలో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్

హైదరాబాద్ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

హైదరాబాద్ హైటెక్ సిటీలో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో శ్రీ విఘ్నేశ్వర ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అధ్యక్షులు, కాకినాడ టౌన్ జనసేన త్రీ మెన్ కమిటీ టౌన్ ఇంచార్జ లిదుగ్గిన నాగరాజు (బాబ్జి)లి, రిటైర్డ్ ఆర్టీఓ చిక్కం రామచంద్ర రావు తదితరులతో వాకపల్లి స్వామి నాయుడు (పెదకాపు)- వి ఎస్ ఎన్ అమలాపురం- ఆంధ్ర ప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, విజయవాడ- శ్రీ విఘ్నేశ్వర ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కాకినాడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరై తమ వ్యాపార అనుభవాలను పంచుకున్నారు.

సీఎం చంద్రబాబు సహాయ సహకారాలు వెలకట్టలేనివి

అమలాపురంలో రూ. 55.41 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అమలాపురం సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

అకస్మాత్తుగా వచ్చే అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా కుంగిపోతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కొండంత ధైర్యాన్ని, భరోసానిస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 114 మంది బాధితులకు సుమారు రూ.55,41,999 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు అమలాపురం నియోజకవర్గంలో 1,279 మందికి రూ. 8.63 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించామని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే ఆనందరావు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాళ్లకత్వ గ్రామంలో పారిశుద్ధ్యం తాగునీటి కష్టాలు

-మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేత

జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

మున్సిపాలిటీగా మారినా తమ సమస్యలు మాత్రం తీరడం లేదని రాళ్లకత్వ 20వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు చెత్త సేకరణకు నెలవారీ రుసుము చెల్లించాల్సి వస్తుండగా, మరోవైపు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామ యువకులు జిన్నారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ట్రాక్టర్ సేవలు పునరుద్ధరించాలి

గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో చెత్త సేకరణ జరిగేదని, మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత ట్రాక్టర్‌ను తొలగించి ఆటో ద్వారా చెత్త సేకరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇందుకోసం నెలకు రూ.50 వసూలు చేస్తుండటంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి

వార్డులో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. నీటి కోసం గ్రామంలోని ప్రజలు సరిగా రాక వాటర్ ప్రతి ఇంటికి సరిపోయినంత రావడంలేదని నీటితో చాలా ఇబ్బంది ఉందని ఆ ఇబ్బంది తట్టుకోలేక మోటార్లు పెట్టాల్సి వస్తుందని బాధ వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరాలో ఉన్న సమస్యలను గుర్తించి, ప్రజలకు నిరంతరం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాళ్లకత్వ 20వ వార్డులో నెలకొన్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని గ్రామ యువకులు కోరారు. ఈ కార్యక్రమంలో సాయి గౌడ్, ఈరబోయిన గణేష్, శ్రీధర్, శ్రీశైలం, మహేష్, శ్రీకాంత్, రాయిని మహేష్, జింక రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రెండు కోర్సుల్లో 30 చొప్పున సీట్లు.. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలే తుది గడువు



మహబూబాబాద్, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఎం.ఎస్.టి., డి.ఇ.సి.జి. కోర్సుల్లో ఒక్కో కోర్సుకు 30 సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రతితో పాటు అసలు ధ్రువపత్రాలు, స్వయం ధ్రువీకరణ చేసిన ధ్రువపత్రాల నకళ్లతో కూడిన ఒక ప్రతిసెట్, రెండు పాస్‌పోర్టు పరిమాణం గల ఛాయాచిత్రాలు, రూ.100 నగదు రుసుమును జతపరిచి అదే గడువులోగా మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులో తప్పుడు వివరాలు నమోదు చేసినా, అవసరమైన ధ్రువపత్రాలను జతచేయకపోయినా దరఖాస్తులను తిరస్కరిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు పత్రం, నిబంధనలు, ఇతర వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వసంత మాధవి

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని పి. వసంత మాధవి తెలిపారు. ఈదరపల్లిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. అనంతరం సీఈవో వసంత మాధవి విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా జోనల్ అధికారులు,రూట్ అధికారులు ఎంతమంది అవసరముంటారో వివరాలను ఎంపీడీవోల నుంచి తీసుకున్నామన్నారు.స్థానిక ఎన్నికలు కీలకమైన హైపర్ సెన్సిటివ్,సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వివరాలను సాయంత్రంలోగా తెలియజేయాలని సూచించామన్నారు.స్థానిక ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు ఎంత మేర అవసరమో, వెహికల్స్ ఎన్ని కావాలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వివరాలను సమర్పించాలని ఆదేశించామన్నారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ

నాయకుల చిత్రపటాలు తీసి భద్రపరచాలని సూచించామన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలను నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సీఈఓ వసంత మాధవి వివరించారు...

శ్రీ లలితా త్రిపుర సుందరిగా రెడ్డెమ్మ తల్లి దర్శనం

గుర్రంకొండ, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. హిమజ, ఈవూరి రెడ్డి శేఖర్ నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా దర్శనమివ్వనున్నట్లు ఆలయ చైర్మన్ లంకిపల్లి రాజన్న నాయుడు, ఈఓ మంజుల తెలిపారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఘన నివాళులు

-కలాం ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం: పృథ్వీరాజ్

పటాన్చెరు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర కృషితో దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధితో పాటు దేశ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్ అశోక్ శ్రీధర్ చారి పరమేష్ వెంకటేష్ గారు, ఆశమ్ గారు, కొండల్ శ్యామ్ షకీల్ రామ్మోహన్ వీరారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతర నిఘా

అమలాపురం, సిటిజన్ టైమ్స్ 15:

ఎన్నికలకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని గురువారం కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా అమలాపురం కలెక్టరేట్ తో పాటు మూడు నియోజకవర్గాల మున్సిపల్ కార్యాలయాలు, ప్రతి మండల పరిధిలోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాటికి సంబంధించిన సంప్రదింపు నంబర్లను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జిల్లా స్థాయి కలెక్టరేట్ లో 08856 - 293104 కంట్రోల్ రూమ్ నెంబర్ అందుబాటులో ఉందని, అదేవిధంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్ 08856 - 231887, ముమ్మిడివరం మున్సిపల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్ 08856 - 295266, రామచంద్రాపురం మున్సిపల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్ 85008 75804 ఈ నెంబర్లో అందుబాటులో ఉంటాయని ఇందుకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదులు, ఉల్లంఘన లకు సంబంధించిన ఫిర్యాదులు నేరుగా తెలుపవచ్చు అని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ ఇంచార్జి లు అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డివిజన్, మండల స్థాయిల్లో అందిన ఫిర్యాదులు, ఎన్నికలకు

సంబంధించిన ముఖ్యమైన పరిణామాలను ఎప్పటికప్పుడు జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని స్పష్టం చేశారు. కంట్రోల్ రూమ్‌ల నిర్వహణకు బాధ్యులైన అధికారులను నియమించి, ఫిర్యాదుల నమోదు, సంబంధిత శాఖలకు పంపించడం, పరిష్కార పురోగతిని సమీక్షించడం వంటి అంశాలకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ నెంబర్ లు కూడా విస్తృతంగా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతర నిఘాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, ప్రచార సామగ్రిని నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు అవకాశం లేకుండా విజిలెన్స్, పర్యవేక్షణ బృందాలను అప్రమత్తం చేయాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన ఉల్లంఘనల వివరాలను వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ బృందాలకు విధులు కేటాయించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

వైసీపీలోకి భారీగా చేరికలు

కావలి: (సిటిజన్ టైమ్స్): అక్టోబర్: 15:

కావలిలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీకి ఊహించని షాక్. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని 33 వ వార్డు నుంచి పలువురు జనసేన కార్యకర్తలు వైసీపీ పార్టీలో చేరారు. ప్రతాప్ కుమార్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆకాశంలో అద్భుత దృశ్యం

సెల్ ఫోన్లో బంధించిన యువకుడు

తాళ్ళరేవు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం తాళ్లరేవు మండలం జార్జిపేట గ్రామానికి చెందిన నాగులపల్లి గణేష్ అనే యువకుడు తన సెల్ ఫోన్లో ఆకాశంలో అరుదైన అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించాడు. బుధవారం సాయంత్రం 5:55 నిమిషాల సమయంలో ఆకాశంలో మేఘాలు వింత ఆకారంలో, వివిధ రంగుల్లో ఏర్పడటాన్ని గమనించిన గణేష్, వెంటనే తన సెల్ ఫోన్లో ఆ దృశ్యాన్ని బంధించాడు. మేఘాలు ఇలా అరుదుగా ఏర్పడటం అత్యంత అపురూపమని స్థానికులు చెబుతున్నారు. ఆ ఫోటోను గణేష్ వాట్సాప్ స్టేటస్ లో పెట్టడంతో అది కాస్తా వైరల్ గా మారింది. ఈ ఫోటోను చూసిన స్థానికులు ఇలాంటి అద్భుత దృశ్యాన్ని చూడటం ఇదే మొదటిసారి అని, ఇది ప్రకృతి అద్భుతం అని కొనియాడుతున్నారు. సాధారణంగా సూర్యాస్తమయ సమయంలో మేఘాలపై సూర్యకిరణాలు పడటం వల్ల ఇలాంటి రంగులు ఏర్పడతాయని, అయితే ఇంత స్పష్టంగా, ఆకర్షణీయంగా కనిపించడం అరుదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అమలాపురంలో విజయదశమి మహోత్సవ కమిటీల పెద్దలకు ఘన సన్మానం

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

కోనసీమ అమలాపురంలో విజయదశమి మహోత్సవాల సందర్భంగా 7 ఉత్తాయవ కమిటీలను నిర్వహిస్తున్న పెద్దలను ఘనంగా సన్మానించారు. దివంగత ఉప్రదష్ట కృష్ణమూర్తి కుమారులచే అమలాపురం డీఎస్పీ ప్రసాద్ చేతుల మీదుగా ఈ సన్మానం చేయడం ఎంతో ఆనందదాయకమని నిర్వాహకులు తెలిపారు. అన్ని వీధుల నుంచి పిల్లలకు సెలవులు రీత్యా యుద్ధకళలో మంచి శిక్షణ ఇస్తూ తమ కమిటీలకు మంచి సపోర్ట్ ఇచ్చినందుకు నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

అమలాపురం మున్సిపల్ ఎన్నికలకు అధికారుల సన్నద్ధం

మున్సిపల్ -కమిషనర్ నిర్మల్ కుమార్

36 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు.. నామినేషన్ల స్వీకరణకు 9 కౌంటర్లు ఏర్పాటు

9 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు.. ఎస్కేబీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన మార్గదర్శకాలు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అమలాపురం పట్టణంలోని 36 వార్డులకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 20న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని వివరించారు. మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం తొమ్మిది కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు

తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి సంబంధించి ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు కోసం ఎస్కేబీఆర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే కూటమి లక్ష్యం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన అమలాపురం, రామచంద్రాపురం స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి సిరిగినేడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజుతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం మురమళ్లలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కార్యాలయంలో నిర్వహించిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వర్ సుంకర పావని, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, కూటమి పార్టీల మధ్య సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ స్థానిక సంస్థల్లో విజయాలు, ఏకగ్రీవ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో 94% స్ట్రైక్ రేట్ సాధించిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అంతకుమించి విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కూటమి పక్షాలతో సమన్వయం చేసుకొని చేయి చేయి కలిపి ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రశాంత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం: ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

అనకాపల్లి జిల్లాలో జరగనున్న పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్లు, పాత నేరస్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ వారంట్ల అమలు, లైసెన్స్డ్ ఆయుధాల డిపాజిట్, తనిఖీల ముమ్మరం, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఉన్న ప్రచార సామగ్రి తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, మైకుల వినియోగ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం, ఓటర్లను బెదిరించడం, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, భయాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన పాల ఏజెంట్ కుటుంబానికి నాగార్జున డెయిరీ ఆర్థిక సాయం

16 ఏళ్ల అనుబంధానికి గుర్తుగా

రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేత

హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15:

నాగార్జున డెయిరీలో గత 16 సంవత్సరాలుగా పాల ఏజెంట్‌గా సేవలందించిన బళ్ళు సంపతి ఆకస్మిక మృతితో ఆయన కుటుంబానికి సంస్థ అండగా నిలిచింది. వడదెబ్బ కారణంగా ఆయన మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేసిన సంస్థ ప్రతినిధులు, కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు సూచనల మేరకు ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. బళ్ళు సంపతికి నాగార్జున డెయిరీతో 16 ఏళ్ల అనుబంధం ఉందని, ఆయన మృతి సంస్థకు తీరని లోటని పేర్కొన్నారు. కష్టకాలంలో ఆయన కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఏజెంట్లు, పాల ఉత్పత్తిదారులు, సిబ్బందితో నాగార్జున డెయిరీకి ఉన్న అనుబంధం కేవలం వ్యాపార సంబంధాలకే పరిమితం కాదని, అది కుటుంబ బంధం వంటిదని స్పష్టం చేశారు. సంస్థతో అనుబంధం ఉన్నవారి కష్టసుఖాల్లో తోడుగా నిలవడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున డెయిరీ సీఈఓ శ్రీకృష్ణ ప్రసాద్, ఏజీఎంలు ఆకునూరి సుధాకర్, వెంకటస్వామి, సిద్దిపేట జోన్ సేల్స్ మేనేజర్ వి. శివకుమార్‌తో పాటు విజయ్, ప్రకాష్, హరీష్, లక్ష్మణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన డెయిరీ యాజమాన్యానికి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ తల్లి మా ప్రజలను చల్లగా చూడమ్మా

-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

- జిన్నారంలో ఏడుపాయల అమ్మవారికి ప్రత్యేక పూజలు



జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15

దుర్గమ్మ మా ప్రజలను చల్లగా చూడు.. ప్రతి కష్టసుఖంలో అండగా నిలుస్తూ ధైర్యం ప్రసాదించు తల్లి అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ఏడుపాయల దుర్గామాతను దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఏడుపాయల దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్ మండల పరిషత్ ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు

అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 15..

అమలాపురం మండల పరిషత్ పరిధిలో 25 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వాటిలో ఏడు ఎస్సీలకు 5 బీసీలకు కేటాయించగా 13 జనరల్ కు కేటాయించారు. బుధవారం రాత్రి అధికారికంగా విడుదల చేసిన వివరాల ప్రకారం ఎస్సీలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలో మొదటి స్థానమైన పాలగుమ్మి ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సి లకు కేటాయించారు. చిందాడగురువు, ఏ వేమవరప్పాడు.. రెడ్డిపల్లి, ఈ వేమవరం ఎంపిటిసి స్థానాలను ఎస్సీ జనరల్ కు కేటాయించారు. పేరూరు..2, ఈదరపల్లి..2,నల్లమిల్లి.. ఏ. వేమవరప్పాడు ఎంపిటిసి స్థానాలను ఎస్సి మహిళలకు కేటాయించారు. బీసీలకు మాత్రం ఐదు స్థానాలనే కేటాయించారు. వాటిలో కామనగరువు..1, 2, రోల్లపాలెం ఎంపిటిసి స్థానాలను బిసి జనరల్ కు కేటాయించారు. ఇక పాలగుమ్మి..1, నడిపూడి స్థానాలను బిసి మహిళలకు కేటాయించారు. జనరల్ కు 13 స్థానాలను కేటాయించగా వాటిలో ప్రధానంగా కీలకమైన బండారులంక..1,2,3 ఎంపీటీసీ స్థానాలతో పాటు భట్నవిల్లి, జనుపల్లి,వన్నెచింతలపూడి ఎంపిటిసి స్థానాలను జనరల్ కు కేటాయించారు. ఇక జనరల్ మహిళలకు ఈదరపల్లి..1, ఇందుపల్లి, పేరూరు..3,4, సమనస,తాండవపల్లి.. ఇమ్మిడివరప్పాడు, గున్నేపల్లి అగ్రహారం.. సాకుర్రు ఎంపీటీసీ స్థానాలను జనరల్ మహిళలకు కేటాయిస్తూ అధికారికంగా బుధవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు.

పొగాకు,మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా, కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలకు చెందిన రావెప్ విద్యార్థులు గురువారం శీలంవారిపల్లి గ్రామంలో పొగాకు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని నిర్వహించారు. పొగాకు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ విద్యార్థులు ఆకర్షణీయమైన ప్లకార్డులు, సమాచార ప్రదర్శన చార్టులను తయారుచేశారు. నినాదాలు, అవగాహన సందేశాల ద్వారా, వారు గ్రామస్తులను, సాధారణ ప్రజలను పొగాకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల డీన్ డాక్టర్ కె మోష, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మార్కాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణకు అవసరమైన స్టేషనరీ, రిజిస్టర్లు, రికార్డుల ఏర్పాట్లపై ఆరా తీశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల నామినేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల రాకపోకలపై ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా ఐపీఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కడపలో ఆర్ఎంపీ వైద్యుల సమావేశం

పాత సంఘంలోకి స్వచ్ఛందంగా చేరిన నాయకులు.. ఘనంగా సన్మానం

కడప, సిటిజన్ టైమ్స్ । అక్టోబర్ 15:

కడప నగరంలోని కెమిస్ట్ భవన్‌లో గురువారం మధ్యాహ్నం ఆర్ఎంపీ వైద్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఆర్ఎంపీ వైద్యుల తొలి పాత సంఘంగా పేర్కొంటున్న 637/97 యూనియన్‌లోకి స్వచ్ఛందంగా తిరిగి చేరిన నాయకులు ఎండీ రాజశేఖర్, బాలాజీలను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి ఎస్ఎండీ ఖలీలుల్లా, గౌరవాధ్యక్షుడు శివకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు మునీర్, బావాజీ పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, నాయకులు ఎండీ రాజశేఖర్, బాలాజీ స్వచ్ఛందంగా తిరిగి తమ సంఘంలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటూ, ఆర్ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆర్ఎంపీ వైద్యులకు, సంఘ నాయకులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలలో కొమరోలు మండలంలోని అన్ని రాజకీయ పదవులకు వైసీపీ అభ్యర్థులే ఎన్నిక కావాలి

కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరును మరోసారి రుజువు చేయాలి -కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన కుందూరు నాగార్జున రెడ్డి

కొమరోలు , సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

స్థానిక సంస్థ ఎన్నికలలో వైసీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కొమరోలు మండలం చింతలపల్లి లో మండల స్థాయి వైసీపీ నేతలు, కార్యకర్తలు విస్తృత సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్ అధ్యక్షత వహించగా, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి,కొమరోలు మండలం మాజీ జెడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి,వైసిపి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుల్ల వెంకటరమణారెడ్డి, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ మారం రామనారాయణరెడ్డి తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి కుందూరు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు విడుదల అయిందని, అందువల్ల కొమరోలు మండలంలోని ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలతో పాటు సర్పంచ్ పదవులకు వైసిపి బలపరచిన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన మండల స్థాయి నేతలను కోరారు. మండలంలోని అన్ని గ్రామాల చెందిన వైసీపీ నేతలు, కన్వీనర్లు,కార్యదర్శులు, కార్యకర్తలు తమ గ్రామ పరిధిలో పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు కొమరోలు మండలం అనాదిగా కాంగ్రెస్ పార్టీకి,ఆ తరువాత వైసిపికి కంచుకోటగా పేరు పొందుతూ వస్తున్నదని, 2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి

ఎదురుగాలి వీచి నప్పటికీ కొమరోలు మండలంలో వైసీపీ అభ్యర్థి అయిన తనకు 1300 ఓట్ల మెజార్టీ వచ్చిందని ఆయన గుర్తు చేశారు. అందువల్ల అధికార పార్టీ బెదిరింపులకు ఒత్తిడిలకు ప్రలోభాలకు వైసిపి కార్యకర్తలు లోను కాకుండా నిర్భయంగా పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, తద్వారా కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరు మరోసారి సార్థకం చేయాలని ఆయన కోరారు. తనతో పాటు మండల స్థాయి నాయకులు, అభ్యర్థులకు,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటారని, అందువల్ల ఎలాంటి సందేహం కలిగిన ఇబ్బంది కలిగిన తమను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు మాట్లాడుతూ, ఎంపీటీసీ,జడ్పిటిసి, సర్పంచుల పదవులకు అభ్యర్థులను ఆయా గ్రామాలలోని నేతలు కార్యకర్తలు ఎంపిక చేయాలని,తప్పనిసరిగా గెలుస్తారనే గట్టి అభ్యర్థులను ఎంపిక చేసి పోటీ చేయించాలని, అంతేకాక పోటీలో నిలబడే అభ్యర్థి తో పాటు మరో ఇద్దరు డమ్మీ అభ్యర్థులతో కూడా నామినేషన్లు వేయించాలని ఆయన కోరారు.పోటీ చేసే అభ్యర్థులు, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, నో డ్యూ సర్టిఫికెట్, అఫీడవిట్, కులధృవీకరణ సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ప్రతి కార్యకర్త వైసిపి బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధించేందుకు అంకితభావం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుల్ల రమణారెడ్డి మాట్లాడుతూ కొమరోలు మండలంలోని అన్ని ఎంపిటిసి స్థానాలతో పాటు జడ్పిటిసి ఎంపీపీ సర్పంచుల పదవులను కైవసం చేసుకుని, కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరును మరోసారి సార్థకం చేస్తూ గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డికి కానుకగా ఇద్దామని ఆయన కార్యకర్తల హర్షధ్వనాల మధ్య పేర్కొన్నారు. కొమరోలు మండలంలోని వైసీపీ కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అభ్యర్థుల విజయానికి కట్టుబడి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడరని అలాంటి వారికి నియోజకవర్గ మండల స్థాయి నేతలు అండగా నిలవాలని ఆయన కోరారు ఆ కార్యక్రమంలో కొమరోలు మండలంలోని మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ మౌలాలి, ఎస్ఎం సుభాని, ఎన్ తిరుపతి రాజు, జాజం వెంకటరమణ, సారే సుజాత, జిల్లా వైసీపీ బీసీ విభాగం కార్యదర్శి సారే జనార్దన్ నాయుడు, కొమరోలు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, వైసీపీ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, గ్రామస్థాయి కన్వీనర్లు, కార్యదర్శులు, వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు గోల్కొండ బ్రదర్స్,14 గ్రామ పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కూరాకు వానిపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ తగిలిపాడి గేదె మృతి

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేత మేస్తుండగా ప్రమాదం.

ఆ గ్రామానికి చెందిన పాణ్యం లక్ష్మీదేవి చెందిన లక్ష రూపాయల విలువ చేసే గేదె మృతి.

కొమరోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కూరాకు వానిపల్లె గ్రామ పొలాల్లో గురువారం సాయంత్రం మేతకు వెళ్లిన పాడి గేదె పొలంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మృతిచెందిన సంఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన పాణ్యం లక్ష్మీదేవికి చెందిన పాడి గేదె గురువారం మేతకై పొలం వెళ్ళింది. పొలంలో దిమ్మెపై గల త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గల పచ్చ గడ్డిని మేస్తుండగా పొరపాటున గేదె తలపైకి ఎత్తడంతో తలకు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలాయి. దీనితో గేదె విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష రూపాయలు వెచ్చించి పాడి గేదెను కొన్నామని, పాడి గేదే ఇచ్చే పాలతో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, అయితే లక్ష రూపాయలు విలువ చేసే పాడి గేదే విద్యుత్ షాక్ కు గురై మృతి చెందడంతో తాము తీవ్రంగా నష్టపోయామని గేదె యజమాని పాణ్యం లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు నష్టపరిహారం చెల్లించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని పాణ్యం లక్ష్మీదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.చింతలపల్లి జేఎల్ఎం రాజబాబు ఇచ్చిన సమాచారం మేరకు తాము లైన్ ఇన్స్పెక్టర్, లైన్ మెన్ తో కలసి కూరాకు వాని పల్లె పొలాలకు వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని, మృతి చెందిన గేదెను పరిశీలించామని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్తు

ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గేదె మృతి చెందిన సంఘటనపై నివేదిక ఉన్నతాధికారులకు పంపించనున్నట్లుగా ఏ శ్రీనివాసులు తెలిపారు.

భారీ వర్షాలకు డి జి పేటలో పొంగిపొర్లిన గుండపు వాగు

వర్షాలతో అన్నదాతల్లో చిగురించిన ఆశలు

సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

మండల కేంద్రంలోని డి జి పేట గ్రామంలోని కొండలపై గురువారం కురిసిన భారీ వర్షాలకు గుండపు వాగు పొంగి పొర్లడంతో గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఎలినినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక పంటల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు తాజా వర్షాలు కొంత ఊరటనిచ్చాయి.వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు ఎలా సాగుతుందోనని ఆందోళన చెందుతున్న అన్నదాతలకు గుండపు వాగులో నీటి ప్రవాహం కొత్త ఆశలను కలిగించింది. వాగు పొంగి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే భూముల్లో తేమ పెరిగి పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. గుండపు వాగులో నీరు ప్రవహిస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తున్నారు. రానున్న రోజుల్లోనూ వర్షాలు కురిసి పంటల సాగుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, పంటలు సమృద్ధిగా పండాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

బ్యాలెట్ పత్రాల ప్రచురణకు సిద్ధంగా ఉండాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు , సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

పురపాలక ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాల ప్రచురణకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లతో గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్స్ లను సమకూర్చుకోవాలని కలెక్టర్ చెప్పారు. పురపాలక ఎన్నికలకు ముందే అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి భద్రతా చర్యలకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను కలెక్టరేట్ కు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు భద్రంగా ఉంచడానికి స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ సెంటర్ లను గుర్తించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ లను గుర్తించాలన్నారు. పురపాలక సంఘాల వారీగా రూపొందించిన ముందస్తు ప్రణాళికలపై నివేదించాలన్నారు. ఈ

సమావేశంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, డి ఆర్ ఓ పి.వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, తదితర మున్సిపాలిటీల కమిషనర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అక్రమ రవాణా నివారణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా గిద్దలూరు-- తాటిచెర్లమోటు రహదారిలో పద్మావతి నగర్ సమీపంలోని కొత్తపట్నం రెస్టారెంట్ దగ్గర హైవేపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వాహనాల తనిఖీలను నిర్దేశిత విధివిధానాలు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు లేదా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించిన పక్షంలో, సంబంధిత వివరాలను నమోదు చేసి, నిబంధనల ప్రకారం తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తత, నిష్పక్షపాత వైఖరి, పారదర్శకత పాటిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, అమల్లో ఉన్న చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ తనిఖీలో (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా, మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ పాల్గొని సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

లలిత త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మ తల్లి



సి.ఎస్.పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 15

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వి.ఆర్. నగర్ లో వెలసిన శ్రీ రాచూరి పెద్దమ్మ తల్లి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఐదవ రోజు అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులు దర్శించుకున్నారు శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

తెలుగు ఇండస్ట్రీ లో ఈ జనరేషన్ 'టార్చ్ బేరర్లు వీళ్లే?

కొత్త పోర్ట్రెయిట్‌లో రితికా నాయక్ సింపుల్ స్టైల్ అందరి మనసులను గెలుచుకుంటోంది

సింపుల్ బ్లాక్ బ్రాలెట్ లుక్‌లో సోనం బజ్వా మెరుపులు

తెలుగు సినిమా ఇండస్ట్రీ కొత్త పుంతలు తొక్కుతూ ముందుకు సాగుతుంది. సినిమాలను తీయడం ఒక ఆర్ట్. అనుకున్నది అనుకున్నట్టుగా విజువలైజ్ చేసి విజయం సాధించిన దర్శకుడికి దక్కే గౌరవం ప్రత్యేకమైనది. ట్రెండ్ సెట్ చేసిన దర్శకుడిని అనుకరిస్తూ కొంతమంది డైరెక్టర్స్ అదే బాటలో నడుస్తుంటారు. ఒక రంగంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, ఫ్రెష్ థాట్ ని ముందుకు తీసుకెళ్లే వాళ్ళని 'టార్చ్ బేరర్' అంటారు...'అరవింద సమేత' మూవీలో చెప్పినట్టుగా ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి బతుకు తాలుకు ఆలోచనలు మారుతుంటాయి. అలాగే సినిమా ఇండస్ట్రీలో కొన్ని సంవత్సరాలకు ఒకసారి సినిమాలు తీసే దర్శకుల ఆలోచన శైలి మారుతుంది. అలాగే సినిమాలు చూసే ప్రేక్షకుడి దృష్టి మారుతుంది. డిఫరెంట్ సబ్జెక్టులతో వచ్చే మూవీస్ ని ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ జనరేషన్ లో తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లే దర్శకులలో ముగ్గురుని 'టార్చ్ బేరర్లు' గా చెప్పుకోవచ్చు వాళ్ళెవరంటే.

రాజమౌళి

వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ ఎమోషనల్ సన్నివేశాలను ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా తెరక్కించడం లో రాజమౌళి సిద్ధహస్తుడు. విఎఫ్ఎక్స్ కి ప్రాధాన్యమున్న సినిమాలను తీయడం మనవల్ల కాదని భ్రమ పడిన వాళ్లందరికీ షాకిస్తూ హాలీవుడ్ ఇండస్ట్రీని మెప్పించేలా సినిమాలను తీసి సక్సెస్ లను సాధించాడు. సినిమా సినిమాకు తన పరిధిని విస్తరించుకుంటూ ప్రస్తుతం పాన్ వరల్డ్ స్థాయికి చేరుకున్నాడు. ఒకప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీని పక్క ఇండస్ట్రీ వాళ్లే పట్టించుకునే వారు కాదు. అలాంటిది ఇప్పుడు ప్రపంచ స్థాయి దర్శకులు సైతం మన గురించి మాట్లాడుకుంటున్నారు అంటే అది రాజమౌళి వల్లే సాధ్యమైంది...

సుకుమార్

మూస ధోరణిలో వెళ్తున్న సినిమాలకు స్వస్తి చెప్పి డిఫరెంట్ కథలను ట్రై చేసి, ప్రేక్షకుడి దృష్టి మార్చేసిన దర్శకుడు సుకుమార్...ఆడియన్స్ అభిరుచి కి అనుగుణంగా సినిమాలను చేస్తూ, కథల విషయంలో చాలా కేర్ తీసుకొని, స్క్రీన్ ప్లే ని అత్యుత్తమంగా ప్రజెంట్ చేశాడు. సుకుమార్ చేసిన ప్రయోగాలు కొన్ని విఫలమై ఉండొచ్చు. కానీ సినిమాను మాత్రం కొత్తగా ప్రజెంట్ చేయడంలో ఆయన ఎప్పుడు ఫెయిల్ అవ్వలేదు...

సందీప్ రెడ్డి వంగ

'అర్జున్ రెడ్డి' సినిమాతో ప్రేక్షకుడి ఆలోచన ధోరణిని మార్చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా... బోల్డ్ కంటెంట్ తో సినిమాని చేసి నెక్స్ట్ లెవెల్ సక్సెస్ ను సాధించవచ్చని ప్రూవ్ చేశాడు... సినిమా మ్యూజిక్, నేపథ్య సంగీతం, సౌండ్ ఎఫెక్ట్స్ ను కొత్తగా ప్రజెంట్ చేసిన దర్శకుడు సందీప్... అర్జున్ రెడ్డి, అనిమల్ రెండు సినిమాలతో ప్రేక్షకుల దృష్టి కోణాన్ని మార్చేశాడు. హీరో అంటే రాముడు మంచి బాలుడు గా ఉండాలని అలా ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మే వాళ్ల నమ్మకాన్ని పటాపంచలు చేశాడు. హీరో అంటే సాధారణ మనిషి మాత్రమే. ఆయనలో పాజిటివ్ లతో పాటు నెగెటివిటీస్ కూడా ఉంటాయని చూపించాడు. అందుకే సందీప్ సైతం టార్చ్ బేరర్ గా నిలిచాడు...

ఈ ముగ్గురు దర్శకులు హిట్ సినిమాలను ఇస్తూనే తర్వాతి తరంలో వచ్చే మేకర్స్ కి ధైర్యాన్ని ఇచ్చారు. అందుకే వీళ్లు నిజమైన 'టార్చ్ బేరర్లు' అయ్యారు...

బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.. కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్

- బుమ్రా లాంటి బౌలర్‌కు ప్రత్యామ్నాయం లేదని చెప్పిన సంజూ శాంసన్
- యువ బౌలర్లు అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్‌లను ప్రశంసించిన వికెట్ కీపర్
- అద్భుతంగా ఆడుతున్న షాయ్ హోప్‌ను గౌరవించాల్సిందేనని వ్యాఖ్య
- తిలక్ వర్మ ఔట్ కావడమే మ్యాచ్‌లో కీలక మలుపు అని వెల్లడి
- ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు మద్దతుగా నిలిచిన శాంసన్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు.ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు.వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు.

ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు.

ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.

ఈ చెత్త బౌలింగ్‌తో మనం వరల్డ్‌కప్ గెలవడం చాలా కష్టం.. మాజీ క్రికెటర్ వ్యాఖ్యలు వైరల్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. విండీస్ నిర్దేశించిన 247 రన్స్ లక్ష్య ఛేదనలో టీమిండియా ఘోరంగా తడబడింది. ఈ నేపథ్యంలో ఇండియన్ బౌలర్ల ప్రదర్శనపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుత బౌలింగ్ కాంబినేషన్‌తో భారత్ ఐసీసీ ప్రపంచకప్ గెలవడం చానా కష్టమని తేల్చి చెప్పేశాడు.

బౌలర్ల వైఫల్యమే భారత్ కొంపముంచింది:

మాజీ క్రికెటర్ కైఫ్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణం బౌలింగ్ వైఫల్యమే.. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించారు. 247 రన్స్ ఇవ్వడమంటే మాములు విషయం కాదు. ఇదే తొలిసారి కాదు, అంతకుముందు కూడా 250ం టార్గెట్‌ను కాపాడుకోవడంలో భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటర్లు 3 మ్యాచ్‌లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు ఓడించారు. ఇలాంటి కాంబినేషన్‌తో ప్రపంచకప్ నెగ్గడం అసాధ్యం అని కైఫ్ హెచ్చరించారు.

2024 ప్రపంచకప్ విజయంతో పోలిక:

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ భాగస్వామిగా నిలిచారు అని మహమ్మద్ కైఫ్ గుర్తు చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి బౌలర్లతో పాటు బ్యాటర్లు సత్తా చాటారని పేర్కొన్నాడు. ఇక నాలుగో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. ప్రతి బ్యాటర్ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం కష్టమని, సంజు శాంసన్ మాత్రం జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడని కైఫ్ అభిప్రాయపడ్డారు.

యువ క్రికెటర్లను యువరాజ్ ఎలా తిట్టేవాడో తెలుసా.. పాత రోజులని గుర్తు చేసుకున్న రోహిత్

భారత క్రికెట్ చరిత్రలోనే డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' షో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సహచర ఆటగాళ్ల వ్యక్తిత్వాలపై హిట్‌మ్యాన్ చేసిన వ్యాఖ్యలు ఒకవైపు నవ్విస్తూనే, మరోవైపు భారత క్రికెట్‌లోని క్రమశిక్షణ, సీనియర్-జూనియర్ అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఇండియన్ ప్లేయర్స్ క్రికెటర్లు కాకపోయి ఉంటే ఏ ప్రొఫెషన్ సెలక్ట్ చేసుకునేవారనే ప్రశ్నకు రోహిత్ ఇచ్చిన ఆన్సర్ ఇప్పుడు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది.

జస్ప్రీత్ బుమ్రా డాక్టర్ అయ్యేవాడు:

బాలీవుడ్ స్టార్ కమెడియన్ కృష్ణ అభిషేక్ అడిగిన ప్రశ్నకు రోహిత్ శర్మ స్పందిస్తూ.. ప్రపంచ నంబర్ వన్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా గనుక క్రికెటర్ కాకపోతే ఖచ్చితంగా డాక్టర్ అయ్యేవాడని చెప్పాడు. మైదానంలో మ్యాచ్ చివర్లో చావు బతుకుల మధ్య పోరాడుతున్న సమయంలో, బౌలింగ్ కి వచ్చి ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను కాపాడే ప్రాణదాతలా బుమ్రా నిలుస్తాడని కొనియాడాడు. ఆ ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను గెలిపించడం అందరికీ సాధ్యమయ్యే పని కాదని హిట్ మ్యాన్ తేల్చి చెప్పాడు.

యంగ్ క్రికెటర్లని యువీ ఘోరంగా తిట్టేవాడు:

మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను రోహిత్ శర్మ 'హెడ్‌మాస్టర్' తో పోల్చాడు. 2006, 2007 కాలంలో తాము కొత్తగా జట్టులోకి వచ్చినప్పుడు యువీ భాయ్ ఒక కఠినమైన హెడ్‌మాస్టర్‌లా వ్యవహరించేవాడని గుర్తు చేసుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణ విషయంలో జూనియర్లను బాగా తిట్టేవాడని, అయితే ఆ తిట్ల వెనుక ఎంతో ఆప్యాయత, ప్రేమ దాగి ఉండేవని పేర్కొన్నాడు. ఆరంభంలో సీనియర్లతో ఆడుతున్నప్పుడు ఉన్న భయం, బెరుకును పోగొట్టి, తమను పూర్తి కంఫర్టబుల్‌గా మార్చడంలో యువరాజ్ పాత్ర మరువలేనిదని రోహిత్ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.ఇక రిషభ్ పంత్‌ను రోహిత్ పర్ఫెక్ట్ 'బేబీ సిట్టర్' గా అభివర్ణించాడు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆటగాళ్ల కుటుంబాలు, పిల్లలు మాతో వచ్చేవాళ్లని.. ప్రాక్టీస్ పూర్తయిన వెంటనే పంత్ పిల్లలతో గడిపేవాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అప్పటి కెప్టెన్ టిమ్ పైన్ 'బేబీ సిట్టర్' అని పిలవడానికి అసలు ముచ్చట ఇదే.. అయితే పిల్లలతో అంత ప్రేమగా ఆడుకుంటూనే, సరదాగా వారి ప్లేట్లలోని ఫుడ్ లాక్కుని తినేసేవాడని, దాంతో ఆ పిల్లలు రిషభ్ పంత్ ని చూసి చిరాకు పడేవారంటూ డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లను రోహిత్ శర్మ నవ్వులు పూయిస్తూ పంచుకున్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776